# మనిషి - మనసు

సుందర్రావుకి నిద్ర మెళుకువ వచ్చేసరికి బాగా ప్రొద్దెక్కింది. కానీ ఎంత ప్రొద్దెక్కిందో మాత్రం ఆతను అంచనా వెయ్యలేకపోయాడు.

అర్ధరాత్రి నుంచీ కురుస్తున్న వాన, యింకా అలా కురుస్తునే వుంది. ఆకాశమంతా మేఘావృత మవటం వల్ల, సూర్యభగవానుడు తెరవెనుకనే వుండి పోవాల్సి వచ్చింది.

సుందర్రావు చేతి గడియారం కూడ అగిపోయింది. కనుక ఎంత ప్రొద్దెక్కిందో అతడికి అంతుబట్టలేదు.

నిద్ర బద్ధకం పూర్తిగా వదలకపోవటం వల్ల, దిండు గుండెల క్రిందకు లాక్కుని. అరచేతిలో ముహాన్ని కూర్చోబెట్టి. కిటికీ చువ్వల గుండా, వీధిలోకి చూడసాగాడు.

కిటకీ కెదురుగా రెండు చింతచెట్లున్నాయి. తలమాసిన వాడి నెత్తిన కుంకుడు నీళ్ల పడ్డట్లు, వాన చింతచెట్ల మీద పడసాగింది. వాటి మధ్య గల రెల్లు పాక మీది గుమ్మడితీగె నగ్నంగా వానలో స్నానం చేస్తున్నది. పాకలో గవిడి గేదెలు, బురదలో రొచ్చులో పడుకోలేక రాటచుట్టూ తిరుగుతూ, తోకతో ఈగలను అదమాయిస్తున్నవి.

సుందర్రావుకి సిగరెట్టు కాలిస్తే బావుంటుందనిపించింది. వెంటనే లేచి, రాత్రి సిగరెట్టు పెట్టె దాచిన జాగాలో వెతికాడు. ఒట్టిపెట్టె, నిండు అగ్గిపెట్టె దొరికాయి. సిగరెట్లు, కామేశ్వరి దాచి వుంటుంది' అన్న నిర్ణయాని కొచ్చి. ఏం చెయ్యాలీ అన్న జిజ్ఞాసలో పడ్డాడు.

అలగాడికి వాన కురుస్తుండంగా, వేడి వేడి పకోడీలు తినాలని, తర్వాత టీపుచ్చుకుని, వెంటనే ఓ సిగరెట్టు ముట్టిస్తే సరదాగా వుంటుంది.

అతని కేం చెయ్యాలో తోచలేదు. ఇంట్లో ఎక్కడా అలికిడి లేదు. కామేశ్వరీ, ఆమెగారి తమ్ముళ్లు చెల్లెళ్లూ ఏమైనట్లు? అన్న అనుమానం వచ్చింది.

మంచం మీద నుంచి, లేచి, అద్దంలో ఓమారు ముహం చూచుకుని, జుత్తు సవరించుకుని, బద్ధకంగా వళ్లు విరుచుకుని ఆపై చేతి వ్రేళ్లు విరుచుకుని, ఆవలించి చిటికె వేసి, వాకిలి తెరిచాడు.

వరండాలో ఓ బల్ల, నాలుగు కొయ్య కుర్చీలు, వరండా మెట్ల దగ్గర కాళ్లు తుడుచుకునేందుకు వేసిన పాత గోనె సంచీ, గోడలన బూజుపట్టిన పాత ఫొటోలు తప్ప మరేం కనబడలేదు.

అక్కడే నలుదిక్కులా కళ్లతో కామేశ్వరికై వెతుకుతూ నిలబడ్డాడు. పేరెట్టి కామేశ్వరిని పిలుద్దామన్న ఆలోచన వచ్చిందిగానీ, ఎవరైనా వింటే.. క్రొత్త పెళ్లికొడుకు అప్పుడే భార్యని పేరెట్టి పిలుస్తున్నాడు సుమా!.. అని విన్నవాళ్లు కళ్లు చికిలించి, ముక్కున వేలుంచుకోవచ్చు, పోనీ రాయబారం జరుపుదామంటే బావమరదులు ఎక్కడో అయిపూ అజా లేరు.

ఏదో పని మీద వరండాలో కొచ్చిన శేషమ్మగారు, అల్లుడు ఇంటి దూలాలు లెక్కబెట్టటం గమనించి, "అమ్మాయి కావాలా నాయినా!" అని అడిగింది.

"ఓసారిలా రమ్మనండి" అని చటుక్కున గదిలోకి దూకాడు సుందరావు.

కామేశ్వరి రాగానే సిగరెట్లు దాచినందుకు గట్టిగా కోప్పడాలని ఏకగ్రీవంగా తీర్మానించుకున్నాడు సుందరావు.

కామేశ్వరి వస్తూనే "లేచారా నిద్ర! అయినా అదేం నిద్రండీ! ఇంత సేపా! త్వరగా ముహం కడుక్కోండి! టిఫిన్ చల్లారుతోంది," అని దండకం చదివేసింది.

సుందర్రావు మాట్లాడలేదు. అలా అని కోపం గాదు. నిశితంగా కామేశ్వరి కోలముఖంలోకి చూస్తూ, "ముందర తలుపెయ్యి! అన్నాడు మంద్ర స్థాయిలో

"ఎందుకో?"

"వెయ్యి చెబుతాను."

"మీరు చెప్పేది నాకు తెలుసుగానీ..ముందు లేవండి బాబు! అమ్మ ఇప్పటికి నాలుగోసారి అడిగింది"

"ఏమనీ?"

"ఏమే మీ అయినింకా నిద్ర లేవలేదా? అని"

"వూ! నువ్వేం చెప్పావు?"

"వచ్చి చూస్తే స్వామివారు నిద్రలో ధ్యానిమగ్నులై వున్నారు. అనవసరంగా నిద్ర పాడు చేయట మెందుకని వచ్చినదాన్ని వచ్చినట్లు వెళ్లాను."

"వూ! సరేగాని సిగరెట్లు తీసుకరా!"

"మహానుభావా! ఆ సిగరెట్లు నేనేం త్రాగను! భయపడకండి భద్రంగా వున్నాయి. ముందు ముహం కడిగి, టిఫిన్, కాఫీలు పూర్తి చేస్తే, తీరిగ్గా కూర్చొని వాటి పని చూడచ్చు." కామేశ్వరి వెళ్లిపోయింది.

కామేశ్వరి కీసారి మంచి గుణపాఠం నేర్పాలి అని నిశ్చయించుకున్నాడు.

సిగరెట్టు పొగ గట్టిగా పీల్చి ఆమె ముహం మీద వదలటం, లేదా ఈ సారి గదిలోకి రాగనే గట్టిగా కౌగలించుకుని ఎముకలన్నీ పిండయ్యేలా నలిపి బుగ్గ మీద గట్టిగా.. కొరికెయ్యటంగానీ చేసెయ్యాలి.

"ఇదిగో బ్రష్ పేస్టు, నీళ్ల వరండాలో పెట్టాను త్వరగా కానియండి. నేనీ లోపల టిఫిన్ తీసుకొస్తాను" కామేశ్వరి గది బయట నుండే తాఖీదు అందచేసి వెళ్లిపోయింది.

సుందర్రావు కిక్కురుమనకుండా, వెళ్ళి ముఖప్రక్షాళన గావించి, సినిమా తారలకు సౌందర్యానిచ్చే సబ్బుతో ముహం తోముకుని, టవల్‌తో ముహం తుడుచుకొని, అద్దంలో ముహం చూచుకుంటూ గదిలో కుర్చీలో చతికిల బడ్డాడు.

ఓ చేత్తో మరచెంబూ గ్లాసు, మరో చేత్తో ఉప్మా ప్లేటూ పట్టుకు, కామేశ్వరి గదిలో కొచ్చింది.

"అంతా!" అన్నాడు కామేశ్వరి చేతిలో ఉప్మా పరిమాణం చూసి.

"యిదేగా?.. తినండి ఫర్వాలేదు!" స్టూల్ ముందుకు జరిపింది.

"నే తినలేను. సగం తీసెయ్యి!"

"పోనీ తిన్నంత తినండి!"

"మిగతాది...."

"నే తింటాను."

"సరేరా! ఇద్దరం కలసే తిందాం!" సుందర్రావు కామేశ్వరిని చెయ్యి పట్టుకు లాక్కున్నాడు వళ్ళోకి!

"అబ్బ వదలండి!"

"తినుమరి"

"తింటాలే." విదలించుకుని, మంచం మీద కూర్చుంది కామేశ్వరి.

"పోనీ నే తినిపించనా!"

"ఏమీ వద్దు ఎవరన్నా చూస్తే బావుండదు!"

"చూడకపోతే బావుంటుందన్న మాటేగా!" చిన్నగా, నవ్వాడు ఓరగా చూస్తూ.

కామేశ్వరి చటుక్కున చూసింది భర్తను, కోపంగా.

"అబ్బ! యింత నెయ్యా వేసేది!"

"ఏం? బాగాలేదా!"

"తిని చూడరాదూ నీకే తెలిస్తుంది."

కామేశ్వరి మాట్లాడలేదు. కిటికీలోంచి, వీధిలోకి చూస్తూ, "అన్నట్లు మరేచ్చిపోయినా! ఇవ్వాళ భోజనాలయ్యేసరికి చాలా ఆలస్యమౌతుందేమో! టిఫిన్ కాస్త బాగా తినండి!" అన్నది.

"ఏం?"

"కావమ్మగారు పోయారు!"

"ఎక్కడికో!"

కామేశ్వరి చిన్నగా నవ్వి, వచ్చే నవ్వుని మునిపంటితో పెదిమనునొక్కి పట్టి, ఆపుకుని, "స్వర్గానికి" అన్నది.

"ఏం అంత తొందర! ఈ వానలో అంతదూరపు ప్రయాణం కష్టం గదా!"

"సర్లేండి! నేర్చారు మాటలు! చావుకి వానా వరద ఏముంది."

"ఓహో!"

"అమ్మాయి కాఫీ తీసుకెళ్లమ్మా!" శేషమ్మగారు వాకిటి ప్రక్కగా నిలబడి కేకేసింది.

'వచ్చే!' కామేశ్వరి లేచివెళ్లి కాఫీ తెచ్చింది. ఈ లోపల సుందర్రావు ఉప్మాకి ఉత్తరాపోశన కానిచ్చేశాడు.

"అదేమిటి! సగం కూడ తినలేదేం!"

"కావమ్మగారి కంత కష్టం వచ్చే! యింకా నాకు టిఫినేం సయిస్తుంది."

"సర్లేండి. కొద్దిగా తినండీ! భోజనాలు ఆలశ్యమవుతాయి."

"ఎందుకనో!"

"పీనుగ ఎత్తు కెళ్లీదాకా, పొయ్యి రాజెయ్యకూడదు."

"ఎందుకనో!"

"నాకు తెలియదు బాబూ! ముందీ కాఫీ త్రాగండి! నే పోతాను."

"ఎక్కడికో!"

"స్వర్గానికి!" చిరుకోపంతోనే అన్నది కామేశ్వరి!

"వానగదా! పోనీ రేపెళ్లు. నేనూ వచ్చి దిగబెడతాను!"

కామేశ్వరి పాల పొంగులాంటి కోపం చటుక్కున చల్లారింది! గలగలా నవ్వేసింది!

సుందర్రావు కాఫీ త్రాగటం మానేసి, మంచం క్రింద వెతకసాగాడు.

"ఏమిటి వెతుకుతున్నారు!"

"రత్నాలు."

"రత్నాలా"

"వూ! నువ్వు అలా అందంగా నవ్వితే, రత్నాలు రాలాయేమోనని..."

"పోండి! మీరు మరీనూ!" సిగ్గుపడింది కామేశ్వరి. చీరకొంగు నిండుగా కప్పుకుంది. "త్వరగా త్రాగండి" అన్నది కిటికీలోంచి, బయటకు చూస్తూ.

"అమ్మాయ్!" పురుషోత్తంగారు కేకేశారు వరండాలోంచి!

"ఏం నాన్నా!"

"కాసిని నీళ్లట్టుకు రామ్మా! కాళ్లు కడుక్కోవాలి!"

సుందర్రావు సిగరెట్టు కాలుస్తూ, క్షణాలు లెక్కపెట్టుకోసాగాడు కామేశ్వరి రాక కోసం!

పురుషోత్తంగారు, కాళ్లు కడుక్కుని, పై మీది బట్టతో కాళ్లు తుడుచుకొని, సుందర్రావు దగ్గర కొచ్చి కూర్చున్నాడు.

"ప్రొద్దున్నే ఎక్కడికో వెళ్లారట్లే వుంది!" సుందర్రావు ముందర పలుకరించాడు మామగారిని.

"అవునోయ్! కావమ్మ గారని, ఈ వీధి మొగదల, ఓ ముసలమ్మ వుంది. మనవాళ్లేలే. రెండురోజులు పట్టి జ్వరం వస్తున్నది. రాత్రి పదిగంటల నుంచీ స్పృహలేదు, ఈతెల్లవారుఝామున 'హరీ' అంది. తెల్లవారిగట్లేవెళ్లి, వస్తువ్వా"

"నాన్నా! స్నానం చేసి కాఫీ త్రాగుతావా!"

"తీసుకరామ్మా! యిప్పుడు స్నానం చేసినా మళ్లీ మయిల పడాలిగా! అంతా అయ్యాకా స్నానం చెయ్యొచ్చు." కామేశ్వరి వెళ్లిపోయింది.

"ఆమెకు కొడుకులూ వాళ్లూ వున్నారా?"

"ఉహూ! లేరు! ఒకణ్ణి పెంచుకుంది."

"చిన్నపిల్ల వాడా?"

"అబ్బే! పెళ్లదీ అయి ఇద్దరో ముగ్గురో పిల్లలు కూడ! గుంటూరులో పొగాకు వ్యాపారం చేస్తున్నాడు!"

"పోతే మరీ మె..."

"అదంతా ఓకథలే!"

కామేశ్వరి కాఫీ తెచ్చింది. తాను త్రాగబోతూ "నువ్వు త్రాగావా!" అల్లుణ్ణి అడిగారు!

"ఆ! నువ్వొచ్చే ముందే;" కామేశ్వరి సమాధానం చెప్పింది మందిగం అనుకొని నిల్చుని.

"పిల్లలంతా ఏరి?" పురుషోత్తంగారు, కాఫీ కప్పు, కామేశ్వరి కందిస్తూ అడిగారు, ఇంట్లో సందడి లేకపోవటం గమనించి.

"కాస్సేపైంది, అలా వెళ్లారు ఆడుకోటానికి!" కామేశ్వరి వెళ్లిపోయింది.

పురుషోత్తంగారు చుట్ట ముట్టించి, ''సమయానికి ఈవానొకటి దాపురించింది. కర్మకాండంతా పూర్తయ్యేసరికి ఈ వానలో ఏవరవుతుందో?" అన్నారు.

''మరి వానగదా దహనానికి వీలవుతుందా?"

''ఏమో! ఈ వానలో దహనం ఏలా చెయ్యటం? పైగా, గుంటూరు మనిషిని పంపాం ప్రాణంపోగానే! అక్కడ కబురంది, వాళ్ల బయలుదేరి రావద్దూ! అప్పటి సంగతి!"

బయట వాన పెద్దదైంది. ధనధనామని చినుకులు, రాళ్ల వార్షంలా పడసాగాయి! సముద్రపు ఘోషలా గాలీ, వాన వినపడసాగింది. డాబా మీది నుంచి, నీళ్ల ధారగా, మెట్ల మీదపడి శత సహస్రాదికంగా, కకావికలుగా సాగాయి నీళ్లు.

వాన తాకిడికి, చెట్ల మీద కాకులు ముడుచుకుపోయి, పెద్దగా అరువ సాగాయి. గాలి విసురుకు చెట్లు తలలోంచి త్రాగిన వాడిలా వూగుతున్నాయి.

గేద ఒకటి, మేకుతో సహా లాక్కుని, వీధి వెంబడి పరుగెత్తసాగింది తోకెత్తుకుని, వానలో దిక్కుతోచక అరుస్తూ!

''ఈ వానలో, వాళ్లు వస్తారంటారా?'' సుందర్రావు ప్రశ్నించాడు.

''వానని రాకపోతే నలుగురు నోట్లో ఉమ్మెయ్యరూ! ఆమె ఆస్థితోనే అతగాడు వ్యాపారం చేస్తున్నాడు!''

''పేరేమిటన్నారూ?''

''రాఘవరావు! రింగురోడ్డులో మేడా అదీ కట్టాడు. ఓ పెద్దకారు, జీపు వున్నాయి!''

''పోతే జీపులో రావచ్చనుకుంటాను!''

''చెప్పలేము. రోడ్డు పూర్తిగా బాగులేదు.. మెయిన్ రోడ్డు దిగాక చెరువుంది చూశావుగా, అక్కడ వానాకాలం బళ్లు రావటం కష్టం! జీపుగాబట్టి వస్తే రావచ్చు!''

''మరి ఆయనొచ్చేదాకా....''

''ఆగాలి తప్పదు! పైగా యింకో సంగతేమంటే కావమ్మగారు, తన భర్త తాలూకు వాళ్లు, తల కొరివి పెడితేనే పుణ్యలోకాలకు పోవటం జరుగుతుందని రాఘవరావుని పెంచుకుంది.''

''అలా అని శాస్త్రంలో వుందా?''

''ఉందని, ఆమె భర్త తాలూకు వాళ్లు ఆమెకు నూరిపోశారు. ఉందో లేదో వివరంగా చూసిన వాళ్లెవరు? ఎవరికేం అవసరం? ఆస్తి, మరొకడు అనుభవించకుండా జాగ్రత్త పడ్డారు!''

క్షణం ఇద్దరూ మాట్లాడకుండా కూర్చున్నారు. పొగతో ఆ గదంతా నిండిపోయింది.

వీధంతా నీళ్ల పారసాగాయి। వాన కాస్త తగ్గింది. గాలింకా తీవ్రంగా వీస్తూనే వుంది. మధ్యమధ్య మెరువసాగింది. ఆకాశమంతా మేఘావృతమై, ప్రకృతి, తల ఆరబెట్టుకుంటున్న స్త్రీలా వుంది.

''గాలివానలే వుంది'' పురుషోత్తం గారన్నారు చుట్ట వీధిలో కిసిరేసి।

''అలాగే వుంది।''

''దొరగారూ।'' వీధిలోంచి, వెట్టి వీరాయి కేకేశాడు.

''ఏదోకబురొచ్చింది। వస్తామరి।'' పురుషోత్తంగారు వరండాలోకెళ్లారు. సుందర్రావు వెళ్లాడు ఆయన వెంట.

వెట్టివాడు, తల తడవకుండా, గోనెసంచీ కప్పుకుని' వరండా మెట్ల క్రింద, సన్నజాజి చెట్టు దగ్గర నిలబడ్డాడు.

''ఏరా?''

"కరణంగారు మిమ్మల్నోసారి రమ్మన్నారు."

"వస్తున్నా. నువ్వు పద. గుంటూరు వెళ్లిన మనిషొచ్చాడా?"

"రాలేద్దొరా." వెట్టివాడు వెళ్లిపోయాడు.

పురుషోత్తంగారు ఇంట్లో కెళ్లి గొడుగు తీసుకొచ్చి, "నువ్వూ పిల్లలతో పి అన్నం తినవోయ్. పంచయనం అయ్యేసరికి ఆలస్యమవుతుంది." అని చెప్పి, ధోవతీ పైకెగబట్టుకుని వెళ్లిపోయారు.

* * *

పిల్లలతోపాటు అన్నం తినటానికి సుందర్రావు ఇష్టపడలేదు. ఆదేదో నామర్దాగా తోచిందతనికి.

"మరి సాయంత్రందాకా వుంటారా?" కామేశ్వరి అడిగింది.

"నువ్వూ?"

"నా సంగతి మీ కెందుకు. వుంటే వుంటాను. లేదా నేనూ రెండు ముద్దలు తింటాను."

"నేనూ అంతే."

"బావుంది. కొద్దిగా మజ్జిగ పోసుకు తినండి."

"ఊహూ.. నా ప్రాణం ఎందుకు తీస్తావుగానీ, కాస్త కాఫీ కలుపుకు రారాదూ?"

"వెధవ కాఫీతో కడుపు నిండుతుందా ఏమన్నానా. కాస్త అన్నమే తినండి."

సుందర్రావు భార్యను అదోలా చూసి, "తిననని చెప్పానుగదూ ఇంతకు ముందు." అన్నాడు.

"సరే మీ ఇష్టం." కామేశ్వరి గిరుక్కున తిరిగి వెళ్లిపోయింది.

సుందరావు నవ్వుకున్నాడు, భార్య ముఖంలోని విసుగు, కోపమూ చూసి.

చామనచాయగా వున్నా 'కావుడు' అందమైంది. చక్రాలంత కళ్లూ, కోటేరులా వుండే ముక్కూ, దొండపండు లాంటి పెదవులు, కొండరాళ్లపై ప్రాకె వల్లత్రాచు లాంటి జడా, అందులో ముద్ద బంతిపూలు పెట్టుకుంటే.. సుందర్రావు తన్మయత్వంలో కళ్లముందు, లీలా మాత్రంగా, భార్య రూపాన్ని చిత్రించుకోసాగాడు.

కామేశ్వరి కాఫీ తెచ్చింది. కాఫీ త్రాగుతూ, కామేశ్వరి కళ్లలోకి చూస్తుంటే, సుందర్రావుకు, కామేశ్వరిని ఉడికించాలనిపించింది.

''కావుడు''

''కావుడేమిటి? కావమ్మ గారిలాగా। మీరలా పిలవకండి''

''ఏం పిలిస్తే''

''నా కిష్టంలేదు। పోనీ నేను మీ కళ్లకు అంత ముసలిదానిలా కనబడుతున్నానా?''

''ముసలిదానివి కావా ఏమిటి? అప్పుడు అంతా కావమ్మ నే అంటారు।''

''అదెప్పటి మాటో। అంత వయస్సు దాకా బ్రతికితే అలా పిలిచినా అభ్యంతరంలేదు।''

కాఫీ కప్పు కామేశ్వరికి అందించి, ''ఒకవేళ కావమ్మ గారిలా నీకూ చిన్నతనంలోనే వైధవ్యం ప్రాప్తిస్తే, అప్పుడూ కావమ్మ ఐపోతావు।''

కామేశ్వరి ముహం ఒక్కసారి పాలిపోయింది. కళ్లల్లో ఓ విచిత్రమైన భయం, జుగుప్స, భీతి ఏర్పడ్డాయి।

''ఏమిటా పాడు మాటలు।'' అన్నది బెరుగ్గా.

''నిజం కావుడు. నాకు పెళ్లయిన మరు సంవత్సరంలో మారకముంది'' అన్నాడు సుందర్రావు కామేశ్వరి ముహంలోని భావసంచలనాన్ని, గమనిస్తునే, మనస్సులో నవ్వుకుంటూ।

కామేశ్వరి తరచితరచి భర్త ముహంలోకి, చూసింది. అతని అంతరార్థ మేమిటా? అని. అంతుబట్టలేదు.

''నీకు తెలియదూ కావుడు। నాకిన్నాళ్ల దాకా పెళ్లెందుకు కాలేదో తెలుసా? ఇందువల్లనే। జాతకంలో కళ్లకు కట్టినట్లు కనుపిస్తున్న సత్యాన్ని ఎవరు కాదన గలరు. అందుకే ఎవరూ పిల్లనిస్తానని రాలేదు। అందుకని మా వాళ్ళు, మీ వాళ్ల కళ్లు గప్పి, జాతకం మార్పించి, నాకు బ్రహ్మచర్యం వదిలించారు। నీ గొంతు కురితాడు బిగించారు।"

''అబద్ధం।'' కామేశ్వరి, ఏడుస్తూనే అరిచింది।

''నీ ఇష్టం। ఎలాగైనా భావించుకో। కానీ ఉన్న విషయం చెబుతున్నాను. వళ్లో నిప్పు ఎంతో కాలం దాగదు గదా। అంతకుముందే చెబుతున్నాను. నీ అమాయికమైన అందమైన ముహం చూశాక, చెప్పకుండా వుండలేకపోతు న్నాను। ఇంత అందమైన ముహానికి వైధవ్యం....''

''ఆపండి।'' ఏడుస్తూ కామేశ్వరి అక్కడనుంచి దెబ్బతిన్న హరిణంలా వెళ్లిపోయింది।

కామేశ్వరి, అలా ఏడుస్తూ వెళ్లాక, సుందర్రావు, పడీ పడీ నవ్వు కున్నాడు, ఆ విషయం పదేపదే తల్చుకుంటూ.

ఎంత నమ్మకం కలిగేలా చెప్పాను। కామేశ్వరి తన ముహంలోని సీరి యస్‌నెస్, మాటల్లో ఏ మాత్రం తడబాటు లేకపోవటం గమనించి, నిజమేనని నమ్మేసింది।

ఎంత పిచ్చిది।

ఆ వూపులో సిగరెట్ ముట్టించి, పొగతో రింగులు వదులుతూ, అవి క్రమంగా పల్చబడి గాలిలో కలిసిపోతుంటే చూస్తూ, ఆనందించాడు.

మళ్లీ వాన పెద్దదైంది। అర్ధరాత్రిప్పుడు, కంకరరోడ్డు మీద ఇనపబూట్ల పోలీసులు పరిగెత్తుతున్నట్లు, పది పెద్దలారీలు ఒక్కసారి బయలుదేరినట్లు

మోతతో వాన కురుస్తోంది। ఉగ్రం వచ్చిన వాడిలా, శివం పూనినట్లు, చెట్లు చేమలు గాలికి ఊగసాగాయి.

సుందరావు వాన జల్లు కిటికీలో గుండా లోపలకు రావటంతో, కిటికీ తలుపులు వేసి కూర్చున్నాడు.

కావమ్మగారు చాలా దురదృష్టవంతురాలు। అనుకున్నాడు.

లేకపోతే ఈ వానేమిటి? తల కొరివి పెడతాడని పెంచుకున్న కొడుకు దూరంగా వుండటమేమిటి? ఇదంతా దురదృష్టమే।

కొడుకు వచ్చాడో లేదో?

వచ్చినా ఈ వానలో, బురదలో, వరదలో శవాన్ని దహనం చేసేదెలా?

అలా అని ఎన్నిరోజులు శవాన్ని ఉంచటం సాధ్యమౌతుంది. ఈ మబ్బులు, ఉరుములు, మెరుపులు చూస్తుంటే వాన నాలుగురోజులన్నా తిష్టవేసే టట్లే వుంది।

మరి ఏం చేస్తారు?

సుందరావుకు ఆలోచనలు, కెరటాల్లా రాసాగాయి।

"కొంతసేపు ఈ వెధవ ఆలోచన మానేసి, కామేశ్వరితో కబుర్లు చెప్పుకుందామనిపించింది।

అంతలోనే, కామేశ్వరి ఏం చేస్తుందో చూడాలి। కానియ్। కాసేపు చూద్దాం। అనిపించింది,

* * *

కామేశ్వరి రెక్కతెగిన పక్షిలా వెళ్లి ఏ చీకటి గదిలోనో, మంచం మీద వాలిపోయి, కడుపులోంచి ఉప్పెనలా వచ్చేదుఃఖాన్ని, అనుభవిస్తూ, తన అంధకార బంధురమైన భవిష్యత్తును తలపోస్తూ వుంటుంది।

కామేశ్వరి చాలా అమాయికురాలు। కాకపోతే తన మాటలు నిజంగా నమ్ముతుందా?

అలా ఆలోచిస్తూ కూర్చున్నాడు సుందర్రావు ఏకాకిగా, గదిలో.

అభాగ్యుని కన్నీళ్లలా వాన కురుస్తూనే వుంది।

నిజంగానే తను ఏ అర్ధాంతరంగానో మరణిస్తే?

ఆపును మరణిస్తే?

సుందర్రావు ప్రశ్నించుకున్నాడు।

కామేశ్వరి అమాయికురాలు। పుట్టిన తదాదీ పుట్టినవూరు తప్ప మరో వూరు, బస్తీ తెలియవు. ఇంతవరకూ ఆకు చాటు పిందెలా, తల్లి చాటున పెరిగింది. అందుకే ఆ కళ్లలో అమాయికతేగాక స్వచ్ఛత, ముఖంలో తేజస్సు వున్నాయి. పట్నవాసపు అలంకారాలు, తళుకు బెళుకులు లేకుండా, అరణ్యంలో పుట్టిన బంతిపువ్వులా, నిండుగా అందంగా వుంది।

తనింతవరకూ, ఇంతటి సౌకుమార్యం గల అమ్మాయిని పట్నంలో చూడలేదు। తనకు తెలిసిన అమ్మాయిలంతా తెలివితేటలు, హొయలు, సోయగాలు, కలిగి, బ్రతుకులో తెగబడి ముందుకు తోసుకెళ్లి జీవితాన్ని అనుభవించగల సమర్థులు. వాళ్ల ప్రకృతిలో స్త్రీత్వం తక్కువ।

అందుకే, చదువు లేకపోయినా, చామనచాయగావున్నా, నాగరికత తెలియకపోయినా, మారుమూలగా వున్న కుగ్రామంలోని, కామేశ్వరిని కావాలని చేసుకున్నాడు.

ఇంతవరకు, తన ఆలోచన, ఆశయాలు సవ్యంగా సాగుతూనే వున్నాయి।

మృత్యువు చెప్పిరాదు। తను చేసే ఉద్యోగం ఫ్యాక్టరీలో। తెల్లారి లేస్తే, యంత్రాలతో మాట్లాడి, కలసిమెలసి పని చేయాలి। ఎప్పుడు ఏక్షణంలో పరాకుగా వున్నప్పుడు, ఏ యంత్రమో, బెల్టో, కరెంటు తీగో, తనను కాటేయవచ్చు। లేదా, దారిలో ఏ బస్సో, బండో కుమ్మెయ్యవచ్చు। ఏమో చెప్పలేం।

నిజంగా అలా జరిగితే?

కామేశ్వరి?....గతేమిటి?

అరణ్యం లాంటి ఈ పల్లెలో పుట్టిన బంతిపూవులాంటి కామేశ్వరి, కాలచక్రంలో బడి, వయస్సు, అందము కోల్పోయి, జీవితంలోని చేదు, చీకటి, అనుభవిస్తూ, కావమ్మలా ఏ, వానలోనో, వరదలోనో, అర్ధరాత్రి దిక్కూ, మొక్కూ లేకుండా, అనంతవిశ్వంలో కల వాలిసిందేనా?

కావమ్మ గారిలా, కామేశ్వరి, చనిపోవాల్సిందేనా? ఎందుకో నమ్మ శక్యంగాలేదు సుందర్రావుకు। అలా అని నమ్మకుండా వుండలేకపోయాడు। ఏమో ?

భవిష్యత్తు ఎవరికి తెలుసు?

ఏం కానున్నదో।

అలా ఆలోచిస్తూ కూర్చున్న సుందర్రావుకు తన ఆలోచన, తనకే వెగటని పించింది.

ఛ। ఏమిటీ వెధవాలోచన వూరికే వుండలేక మనసు పాడు చేసుకోవటం తప్ప ప్రయోజనమేముందీ వెధవ ఆలోచనతో।

కామేశ్వరి ఎంత బాధపడుతున్నదో తన మాటలకు।

సుందర్రావు, లేచి వరండాలోకెళ్లి, "కామేశ్వరీ" అని పిలిచాడు।

సమాధానం రాలేదు। మళ్లీ పిలిచాడు

ఆ పిలుపుకు, శేషమ్మ గారు వచ్చింది.

"కామేశ్వరిని ఓ సారి రమ్మనండి।"

గదిలో కూర్చుని, కామేశ్వరి రాకకోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు.

బయట వాన తగ్గింది గాలింకా వీస్తూనే వుంది.

కామేశ్వరి, చక్కగా ముస్తాబైంది. ముహంలోని భీతి, భయమూ లేవు. కళ్లకు కాటుక దిద్దుకుంది. తల దువ్వుకుని, జడలో సన్నజాజులు తురుముకుంది. వంగ పూవురంగు చోళీ వేసుకుని, గచ్చకాయ రంగు లేత చీర ధరించింది. మెళ్లో నల్లపూసలు, నాలుగు పేటల బంగారు గొలుసు, ముక్కున ఎర్రరాయి పుడక, చెవులకు లోలకులు, కాళ్లకు వెండి పట్టాలు మెట్టెలు ధరించింది.

ఆ రూపం చూసి, సుందర్రావు ముగ్దుడయ్యాడు. సాక్షాతూ వనలక్ష్మి అని మురిసిపోయాడు.

లేచి, వెళ్లి ఆమెను పొదివి కౌగలించుకుని, ''అనవసరంగా నీతో అబద్ధాలు చెప్పాను కామేశ్వరి నిజంగా నువ్వెంత బాధపడ్డావో" అన్నాడు.

"మొదట నిజమే అనుకున్నా."

"నిజంగా?"

"హూఁ"

"ఎందుకని"

"నా పేరు కామేశ్వరి। పెద్దయితే కావమ్మనే అంటారు। పైగా, కావమ్మ గారి భర్త పేరేమిటీ తెలుసా?"

"ఏమిటీ?"

"సుందర్రావే"

సుందర్రావుకు క్షణం గుండె ఝల్లుమంది।

"నిజంగానా।"

"ఆ। ఇవన్నీ ఆలోచించుకుంటే నిజమేననిపించింది। కానీ నిజమైనా ఆమె లాగా, నాకూ కావాలనేముంది? ఏమంటారు।"

సుందర్రావుకు ఎందుకో నీరసం వచ్చింది। ఏం మాట్లాడలేదు। మంచం మీద పడుకొని శూన్యంలోకి చూస్తూ, ఏమిటో ఆలోచించసాగాడు।